భయమే చావన్నారు. భయపడిన మనిషి యెంత దురన్యాయాలనైనా కళ్ళారాచూస్తూ వుండిపోవలసి వస్తుంది. కనుక చావుకన్నా హీనం కాదా?

అప్పటికి అరగంటనుంచి నేవా బస్టాపులో బస్ కోసం ఎదురుచూస్తున్నాను. ఎంత త్వరగా ఇంటికి వెడదామనుకుంటే అంత ఆలస్యం అయింది. ఆటోలో వెడితే ఏడురూపాయలవుతుంది. నగర జీవితపు ఇబ్బందుల్లో బస్ టైంకి దొరక్కపోవడం ఒకటి. వెలుతుర్ని చీకటి మింగెయ్యడం నేనక్కడ ఉండగానే జరిగింది.

సిటీ బస్ వచ్చింది.


అప్పటికే అది నిండిపోయి రష్‌గా వుంది. అయినా డ్రైవర్ అక్కడ ఆపాడు. "నొప్పించక తానొవ్వక...." అన్నట్టు ఎవరి కాలూ తొక్కకుండా నా కాలు మరొకరు తొక్కే అవకాశం ఇవ్వకుండా బస్సెక్కాను.

బస్ బైల్దేరింది.

ముందుకి పొమ్మని (జీవితంలో) నన్ను హెచ్చరించేవాడు బస్ కండక్టరొక్కడే. అతను ఇంగ్లీషులో, ఉర్దూలో, తెలుగులో నన్ను, తోటి పాసింజెర్లను ముందుకి పొమ్మని మరీ మరీ కోరుతున్నాడు.

మనుషుల మనస్తత్వాలు చాలా చిత్రంగా ఉంటాయి. బస్‌లోకి ఎక్కేందుకు వీల్లేనంత రష్‌గా వున్నప్పుడు కింద నిలబడి "కాస్తముందుకి జరగండయ్యా- మేం ఎక్కనక్కర్లేదా?" అని బస్‌లోని జనాన్ని హెచ్చరిస్తుంటారు. ఓసారి లోపలికెక్కడం జరిగితే ఇహ ముందుకు జరగరు. కండక్టరు ఏం చెప్పినా పట్టించుకోరు. వీలైతే నిలువుగా ఉండే ఓ కడ్డీని ఆనుకుని నిలబడిపోతారు. అది తమ రాజ్యమైనట్టు- ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక్క అంగుళంకూడా ముందుకి జరగడం కుదరదన్నట్టు ప్రవర్తిస్తారు.

"ప్రజాసేవయే మా కర్తవ్యం" అన్న ఆర్టీసీవారి హామీని పూర్తిగా అమలుజరపాలన్న తపన వున్నట్టుగా ఉన్నారు డ్రైవర్, కండక్టరు. సాధారణంగా బస్ రష్‌గా వుంటే మధ్యలో ఒక్కో స్టేజీ దగ్గర ఆపకుండా వెళ్ళిపోవడమో, లేకపోతే స్టేజీకి అరమైలు ముందో, వెనకో ఆపి జనం పరిగెత్తుకుని అక్కడికి వచ్చేసరికి "నన్ను పట్టుకోండి చూద్దాం" అన్నట్టు బస్‌ని స్పీడుగా పోనివ్వడమో చేస్తుంటారు. అలాంటిది వీళ్ళు మాత్రం ప్రతి స్టేజీలోను ఆపుతున్నారు. దాంతో మరింతమంది జనం ఎక్కుతున్నారు. జనం ఎక్కువయ్యే కొద్ది సహజంగా గాలి ఆడక, ఊపిరి సలపక, ఉక్కగా నానా బాధగా ఉంది.



"ముందుకి జరగండి"

"ఎక్కడికి జరగాలండి. అసలే చస్తుంటేనూ?"

"అయ్య బాబోయ్....కాలు తొక్కేశారు."

"సారీ గురూగారూ- చూళ్ళేదు."

"అంటే ఒకోసారి చూసుకుని కూడా తొక్కుతారా?"

"సారీ అన్నానుగా."

"వెనకటికి మీలాంటివాడే...."

"మోచెయ్యితో అలా పొడుస్తావేమిటయ్యా."

"మీరు చంకలో ఆ ఫైల్ తియ్యండి- గుచ్చుకుంటోంది."

"స్వాతంత్ర్యమొచ్చి ముప్పైమూడేళ్ళయినా మనవాళ్ళు కనీసం బస్సులు వెయ్యలేకపోయారు.... ఛీఛీ...."

"అంజయ్య ప్రభుత్వం నిలబడుతుందంటారా."

"మా ఎం.ఎల్.ఏ ఏమంటాడంటే.."

........ .... .... ....

"అలా సీటుకేసి నొక్కేస్తారేవిటి?"

"అంత హాయిగా వెళ్ళాలనుకునేవాడివి ఆటోలో వెళ్ళాల్సింది."

"మరే - ఆపాటి సలహా చెప్పే పోటుగాడు దొరక్క...."

"పోటుగాడంటావ్ - మాటలు తిన్నగా రానియ్యి."

"కాదులే.... ఆటగాడు. వేటగాడు. పాటగాడు - చల్లగా లేస్తోంది...."

అందరూ నవ్వులు....

నవ్వులొకటేకాదు- చిరాకులు, పోట్లాటలు, ఛీత్కారాలు, నిట్టూర్పులు, ఉస్.... ఉస్సూలు .... సంసారపు బాధలు, ఆఫీసు

బాధలు, ఆఫీసరు దుష్టత్వం. డాక్టర్ల అన్యాయం, రాజకీయాలు, రాచకీయాలు, పువ్వులు రాలినట్లునవ్వే రిసెప్షనిస్టుకథలు, రంకులు, బొంకులు.... అదో చిన్న తరగతి 'మధ్యతరగతి ప్రపంచం.'

.... ........ ........

నేను ముందుకి ముందుకి జరుగుతూనే ఉన్నాను. దాదాపు ఆడవాళ్ళకోసం ప్రత్యేకించబడిన సీట్లదగ్గరికి చేరుకున్నాను.

ఏ జి. ఆఫీస్‌స్టాప్ వచ్చింది. అది లాస్ట్ టికెట్ ఇష్యూయింగ్ పాయింట్. పాసింజెర్లందరికీ టికెట్లివ్వడం పూర్తిచేసి అక్కణ్ణుంచి బైల్దేరాలి. కండక్టర్ ఎంత త్వరగా తెముల్దామనుకున్నా— ఆలస్యం అయిపోతుంది. కండక్టర్ తన దగ్గరకొచ్చేక జేబులో చెయ్యి పెడతాడొకడు. పావలా టికెట్‌కి పది రూపాయల నోటిస్తాడు మరొకడు.

ఉక్కబోత, బాధ, ఇరుకు........ కొందరు ఆర్టీ సీని, మరి కొందరు డ్యూటీ సక్రమంగా చేస్తున్న కండక్టర్ని మెల్లిగా తిట్టుకుంటున్నారు- నా కొంచెం దూరంలో నుంచున్న నీలం రంగు బనీను వేసుకున్న కుర్రాడు బెల్ కొట్టాడు. డ్రైవరు బైల్దేరబోయాడు. కండక్టర్ 'హోల్డాన్' అని అరిచి "ఎవరా జూనియర్ కండక్టర్" అని గట్టిగా అన్నాడు— నీలం బనీను నవ్వాడు. అతని పక్కనున్న గళ్ళచొక్కా సపోర్టింగ్‌గా నవ్వాడు.

కండక్టర్ అటు తిరిగి మళ్ళీ టిక్కెట్లివ్వడంలో మునిగిపోయాడు. నీలం బనీను మళ్ళీ బెల్ కొట్టాడు: పులి కథ చదువుకున్న డ్రైవరు ఈసారి బైల్దేరలేదు. కండక్టరు మాత్రం పులైపోయాడు "కౌన్ హై మాకే...." ఈసారి ఉర్దూలో



తెలుగు పుస్తకాలు
కాశీరామేశ్వర మజిలీ కథలు రు. 15/-
గృహ వైద్యదీపిక 280 రోగాలకి రు. 10/-
కొక్కోకము (కామసూత్రాలు) రు. 10/-
అనుభవవైద్యం అన్నిరోగాలకి రు. 20/-
వర్తక మర్మాలు (చిన్న పరిశ్రమలు) రు. 15/-
టైలరింగ్ బుక్ (బొమ్మలతో) రు. 15/-
4 పుస్తకములకు పోస్టేజి ఉచితం.
ఉషా బుక్ సెంటర్,
గాంధీనగర్, తాడేపల్లిగూడెం-1 (A.P.)

ఉచితం ఉచితం ఉచితం
తెల్ల మచ్చలు
ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండి పోవును. ప్రచారం కొరకు ఒక సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.
Address
Samaj Kalyan (R. L. 2)
(P. o.) Katri Sarai (Gaya)





బెల్ కొట్టినవాడి తల్లిని తిట్టాడు. మరి నీలం బనీనుకి తల్లిమీద గౌరవంలేదో, కండక్టర్ ఉద్యోగంలోఅన్న దానికి ఒప్పుకున్నాడో తెలియదుగాని.... అల్లరిగా నవ్వి ఊరుకున్నాడు. గళ్ళచొక్కా శ్రుతి కలిపాడు.

[ఈ కథలో పాత్రల పేర్లు నాకు తెలియవు. తెలిసే అవకాశం లేదు. అంచేత ఆ పాత్రలకి నేనే పేర్లు పెట్టుకున్నాను... పాఠకులు గ్రహించగలరు— రచయిత.]

నీలం బనీనుకి పాతికేళ్ళుంటాయి. చదువులో పెట్టినందువల్ల చెడిపోయిన కుర్రాళ్ళా వున్నాడు. జీన్స్ వేసుకుని, బ్రూస్లీ బొమ్మవున్న నీలం బనీను వేసుకున్నాడు. జుట్టంతా చిందర వందరగా ఉంది. చేతిలోని పుస్తకాన్నిచూస్తే కాలేజీలో చదువుకుంటున్నాడనో, చదువుకుంటున్నానని చెప్పి ఇంట్లో డబ్బులు తీసుకుంటున్నాడనో అనిపిస్తుంది. మొహంలో నిర్లక్ష్యం, పొగరుమోత్తనం చూస్తే ఇంగ్లీషు సినిమాలు ఎక్కువగా చూస్తున్నట్టనిపిస్తాడు. చేసే అల్లరి, మాట్లాడే తీరు చూస్తే జీవితంమీద నిర్దుష్టమైన అభిప్రాయం కాని, భవిష్యత్తుమీద ఆశగాని లేనట్టు కనిపిస్తాడు.

మొత్తంమీద హిందీ సినిమాల్లో సబ్ జూనియర్ విలన్లా అనిపిస్తాడు.

అతని పక్కనేవున్న గళ్ళచొక్కా కుర్రాడు అతని స్నేహితుడై వుంటాడు. గళ్ళచొక్కా అమాయకంగా ఉన్నాడు. ఎవరి ఆసరాయేనా వుంటే అల్లరిచేసే వాడిలా తెలుగు సినిమాలో హీరో అండతో అల్లరిచేసే హాస్య పాత్రధారిలా ఉన్నాడు. జీవితంలో నీలం బనీన్ల ప్రభావం పడకపోతే చదువుకుని, శ్రద్ధగా ఉద్యోగం చేసుకుంటూ బతికేవాడిలా అనిపిస్తాడు.

నీలం బనీను జోకెయ్యడం గళ్ళచొక్కా నవ్వడం జరుగుతోంది. సరిగ్గా వాళ్ళు నుంచున్న చోటుకి దగ్గర్లోనే ఓ సీట్లో ఓ దంపతులు కూర్చున్నారు. వారిలో భర్తకి ముప్పైఏళ్ళ వయసుంటుంది. నల్ల ఫ్రేమున్న కళ్ళజోడు పెట్టుకున్నాడు. అతని భార్య లేత తమల పాకులా ముగ్ధగాను, అమాయకంగాను, అందంగాను వుంది. ఆమెచూపు చల్లగాను, నవ్వు హాయిగాను ఉంది. వాళ్ళ దాంపత్య జీవితపు కొత్తదనం పోనట్టుగా వున్నారు. కళ్ళజోడు తమలపాకుకి బస్‌లోంచి ప్రదేశాలు చూపించి ఏదో చెప్తున్నాడు.

నీలంబనీను క్రూడ్‌జోకులకి గళ్ళచొక్కా పకపక నవ్వుతుంటే కళ్ళజోడు అసహనంగా, ఇబ్బందిగా చూస్తున్నాడు. తమలపాకు విననట్టుగా ప్రవర్తిస్తోంది. ఆమె వినాలన్నట్టుగానే నీలంబనీను ప్రవర్తిస్తున్నాడు.

బస్ ఆగుతోంది. బైల్దేరుతోంది. జనం ఎక్కుతున్నారు. దిగుతున్నారు. రద్దీ మాత్రం తగ్గలేదు.

“ఏ స్టాపొచ్చింది- ఆ.... హిమాయత్ నగర్ ?” నీలం బనీను ఒంగుని కిటికీ లోంచి చూసి నిర్ధారించుకున్నాడు. అలా ఒంగోడంలో అతనిగెడ్డం తమలపాకు నెత్తిమీద తగిలింది.

గళ్ళచొక్కా అర్ధవంతంగా నవ్వాడు.

నీలం బనీను కావాలనే అలా చేశాడని నాకనిపించింది. తమలపాకుకికూడా అన్పించినట్టుంది. మెల్లగా భర్తకేదో చెప్పింది. అతను కోపంగా నీలంబనీను మొహంలోకి గుచ్చి గుచ్చి చూశాడు. దానికి జవాబుగా అతను అల్లరిగా నవ్వాడు. కండక్టర్ మగాళ్ళందరికీ టికెట్స్ఇచ్చేసి వెనకవైపు నుంచి ముందువైపు దిగివస్తున్నాడు.నీలంబనీనుగంటకొట్టాడు.డ్రైవర్ బస్ బైల్దేరదీశాడు.టికెట్ ట్రేతో బస్‌మీద గట్టిగా కొట్టాడు కండక్టర్. బస్ ఆగింది.

“ఎవడ్రా గంట కొట్టే ఎదవ.దమ్ముంటే నా ఎదురుగా కొట్టరా - నా కొడకా నీ ప్రాణాలకి గంట కొట్టేస్తాను.” కండక్టర్ కిటికీ లోంచి బస్‌లోకి చూస్తూ అరిచాడు. నీలం బనీను, గళ్ళ చొక్కా ముసిముసిగా నవ్వుకున్నాయి.

“పోనీలేవయ్యా- ఎవరో పోకిరీ వెధవలు. నువ్వు లోపలికిరా”సీట్లో కూర్చున్న పెద్దమనిషి కండక్టర్ని సముదాయించాడు.

బస్ బైల్దేరింది.

నేను నీలం బనీను చేష్టల్ని జాగ్రత్తగా గమనిస్తున్నాను. అతను మెల్లగా దంపతులు కూర్చున్న సీటుకి వున్న కడ్డీమీద చేయిపెట్టి నుంచున్నాడు. వీలైనప్పుడు చేతి వేళ్ళ జాపి తమలపాకు తల్లోపువ్వులు లాగుతున్నాడు. ఇది కనిపెట్టి ఆమె కాస్త ముందుకి ఒదిగి కూర్చుంది. కళ్ళజోడు తీవ్రంగా నీలం బనీను మొహంలోకి చూశాడు.

“హోహోయ్ పాపారావు !” అన్నట్టు నవ్వాడు నీలంబనీను. వెంకటేశా టాకీసు దగ్గర కొచ్చేసరికి ‘ఓ స్టాపొచ్చింది’అని కిటికీవైపు వొంగున్నాడు. అతని గెడ్డం తమలపాకు తలకి తగిలింది.

కళ్ళజోడు సహనం చచ్చిపోయింది.

“మనిషివా, పశువ్వా — ఏంటా రౌడీ పనులు” నీలం బనీనుకేసి కోపంగాచూస్తూ అన్నాడు కళ్ళజోడు.

“ఏంటి వాగుతున్నావ్?” నీలం బనీను ఎదురన్నాడు.

"పిచ్చివేషాలేశావంటే తంతాను జాగ్రత్త!"

"ఓహో— తన్నే మొనగాడు బైల్దేరేడు. పొరపాటున తగిలితే అరుస్తావెందుకూ?"

నీలం బనీను సమర్థించుకుంటున్నట్టుగా అన్నాడు.

"పొరపాటా? ఏవండీ గురూగారూ- ఇందాకట్నుంచి మీరు చూస్తున్నారుకదా? కావాలనే వెధవ పనులు చెయ్యడంలేదూ?" కళ్ళజోడు నన్నడిగాడు.

నేను గొప్ప ఇరుకులో పడిపోయాను. 'కరవమంటే కప్పకుకోపం, ఒదలమంటే పాముకుకోపం' ఎందు కొచ్చిన తద్దినం.

నవ్వి వూరుకున్నాను.

నేను చెప్పనని నీలంబనీనుగాడు గ్రహించినట్టున్నాడు. "ఆయన చూశారన్నావుగా చెప్పమను!" ఛాలెంజ్ చేశాడు (ఆరివెధవ-నా బలహీనత కనిపెట్టేశావా?)

"చూశారుగా చెప్పండి గురూగారూ!" కళ్ళజోడు రెట్టించాడు. నేను మళ్ళీ వెర్రి నవ్వొకటి నవ్వాను. నేను తనకు సాయం రానని కళ్ళజోడు కనిపెట్టినట్లున్నాడు. ఊరుకున్నాడు. తమలపాకు నాకేసి నిరసనగా చూసినట్టనిపించింది.

"ఏం ఆయన చూశారన్నావుగా — ఆయన చెప్పలేదేం?" నీలం బనీను గదమాయించాడు.


"పోనీలెండి, కాసేపట్లో అందరం దిగిపోతాంకదా, గొడవలెందుకు?" ఓ ముసలాయన సలహా యిచ్చాడు.

కళ్ళజోడు పరిస్థితిలో లేనందుకు నేను చాలా సంతోషపడ్డాను. అందుకే రద్దీగా వుండే రూట్లలో నేనెప్పుడూ మా ఆవిడతో బస్సెక్కను. డబ్బులు పోతే పోయాయని ఆటోలో వెడతాను.

అంతే! మనం గొడవలు లేకుండా, ప్రశాంతంగా జీవించాలనుకున్నప్పుడు రౌడీ వెధవలకి మనమే దూరంగా ఉండాలి. చెడ్డకి సాధ్యమైనంత దూరంలో నడవాలి. చెడుగు మనమీదకొస్తుంటే మనమే తప్పుకోవాలి. అవసరమైతే పరుగెత్తి పారిపోవాలి.

కళ్ళజోడు అసలో పొరపాటు చేశాడు. నీలం బనీను అల్లరి చేస్తున్నాడనిపించినప్పుడే అతను పెళ్ళాంతో సహా ఏదో స్టాపులో దిగిపోయి, ఆటోలో వెళ్ళిపోవల్సింది. పక్కన భార్యను పెట్టుకుని రౌడీ వెధవతో కొట్లాటకు దిగడం విజ్ఞుల లక్షణం కాదు. నేనైతే కళ్ళజోడులా ప్రవర్తించేవాణ్నికాదు.


సుధా హోటల్ దగ్గర డ్రైవరు సడన్


5 సంవత్సరాలు గ్యారంటీ గల మెరి సూపర్ స్పెషల్ బంగారు కవరింగ్ నగలను 15 సంవత్సరాల పరిశోధన ఫలితంగా - భారత దేశంలో ప్రప్రథమంగా తయారు చేస్తూ, దేశమంతటా విరివిగా వి. పి. పి. ద్వారా పంపే సంస్థ

ఉచితంగా కేటలాగ్ పొంది అన్ని వివరాలు చూడగలరు. అందులోని సంఖ్యలు సూచిస్తూ, ఉత్తరం రాస్తే, వి. పి. పి. ద్వారా వస్తువులు పంపబడతాయి

(వి. పి. పి. చార్జీలు అదనం)




RAVI

**MERI GOLD COVERING WORKS** (Estd 1965)
**P.O. BOX 1405, 14, RANGANATHAN STREET**
**T.NAGAR MADRAS-600017 INDIA**

బ్రేక్ వేశాడు. జనం కాస్త తూలారు. నీలం బనీను దాన్ని ఆసరాగా తీసుకుని యింకాస్త యెక్కువ తూలి తమలపాకు వాళ్ళోపడ్డాడు. అది కావాలని చేశాడని నాకు తెల్సు. డెలిబరేట్ మిస్చిఫ్....

ఫినిష్....

కళ్ళజోడు యింక ఇంజనాగదనుకున్నాడు.

నీలం బనీను లేచి గళ్ళచొక్కాకేసి చూసి వెధవ నవ్వొకటి నవ్వేసరికి కళ్ళజోడు వాణ్ణి లాగి ఓ తన్ను తన్నాడు.

గొడవ మొదలైపోయింది.

అతను తంతాడనీ. తన్నగలడనీ నేను ఊహించలేదు. నీలం బనీను కూడా ఊహించి ఉండడు. ఓ క్షణం వాడికి మతిపోయింది.

"తంతావురా బాడ్ఖోవ్" అంటూ కళ్ళజోడు మెడవంచి ఓ గుద్దు గుద్దాడు. కళ్ళజోడు లేచి నీలం బనీను మెడ పట్టుకున్నాడు.

బస్సంతా కేకలు, ఈలలు, గోలలు.... బస్ ఆగిపోయింది. కళ్ళజోడు పరిస్థితిని విషమింప చేసుకుంటున్నాడు. నేనైతే ఇలా ప్రవర్తించేవాణ్ని కాదు. నీలం బనీను వెధవ....ఆ విషయం తెల్సుండీ వాడితో ఆ రకంగా పోట్లాటకి దిగకూడదు. కాస్సేపట్లో క్రాస్‌రోడ్స్ వచ్చేస్తుంది. కాస్త ఓపిక పట్టాల్సింది. వాడు అన్నింటికీ తెగించినవాడు— మనం....మనం మర్యాదగా బతుకుతున్నవాళ్ళం.

కండక్టర్ వచ్చాడు.

"బాబూ- మీరిద్దరూ కొట్టుకుంటే కిందకుదిగి కొట్టుకోండి. బస్సులోకాదు." తన రాజ్యంలోమాత్రం శాంతిని కోరుకునే రాజులా అన్నాడు. కండక్టర్ ధోరణి నాకు నచ్చలేదు. ఎవరిది తప్పో తెల్సుకోదేం? తప్పుచేసినవాణ్ని దింపెయ్యొచ్చు కదా?

కండక్టర్, మరొకాయన కల్సి ఇద్దర్నీ విడిపించారు. నీలం బనీనుని ఇంకాస్త ముందుకి తీసికెళ్ళి అక్కడ నుంచోమన్నాడు కండక్టరు.

కళ్ళజోడు కాని, తమలపాకుగాని నాకేసి చూస్తారేమోనని నేనెటో చూస్తున్నాను. గిల్టీ. నిజాన్ని చెప్పలేకపోయిన గిల్ట్. తప్పించుకుని మర్యాదస్తుణ్ణి అయిపోయానన్న గిల్ట్ మనసులో పురుగులా దొలుస్తోంది.

ఎందుకు నాలో యింత పిరికితనం...? ఎవరు నాలో ఈ భయాన్ని నూరిపోశారు? పక్కింటి అబ్బాయి కొట్టినా సరే గొడవ పెట్టుకోకుండా యింటికి వచ్చెయ్యమని చిన్నప్పుడు చెప్పిన నాన్నా? అహింసా పరమో ధర్మః అని నూరిపోసిన గురువులా? నేను చదువుకున్న చదువా? పెరిగిన వాతావరణమా? సంసారపు బాధలా?

నేను మొదట్నుంచీ యిలా లేనుకదా— కాలేజీలో పున్నప్పుడు నాతో చదివే మూర్తిని .... ఓ పళ్ళ దుకాణం మీద దండెత్తి దుకాణమంతా ధ్వంసంచేసి. వాణ్ని చితకతన్నాం. ఆ దాడికి నేనే ఆధ్వర్యం వహించానుకదా....కాలేజీలో ఎన్నో సమ్మెలు నిర్వహించాను. ఓ కుర్రాణ్ని తిట్టిన ఫిజిక్స్ లెక్చరర్ మీద దండెత్తాం, మా ఫ్యాక్టరీలో పన్జేస్తున్న ఒకతనికి శెలవు ఇవ్వలేదని డిప్యూటీ మేనేజర్‌ని ఘెరావ్ చేసి అతనిచేత శెలవు, క్షమాపణ ఉత్తరం ఇప్పించాను.

నా సాహసాల గురించి ఎన్ని కథలు. శతసహస్ర సాహసగాథా నాయకుణ్ని. ఈ కథలన్నీ మిత్రులకి చెప్పుకుని చాలా ఆనందిస్తుంటాను. మరి ఈ నిజానికి నిలబడలేనితనం, చెడ్డకి ఎదురు నిలవలేనితనం.మంచికికొమ్ముకాయలేని.పిరికితనం ఎక్కడ నేర్చుకున్నాను....

ఎంత భయంగా బతుకుతున్నాను.

ఇంత ఆలోచించి నా మనసుని ఊరడించి సమాధానం చెప్పుకున్నాను.

ఎందుకొచ్చిన గొడవ— ఎవడు తలదూరుస్తాడు— అసలే నీలం బనీను రౌడీ వెధవలా ఉన్నాడు——

క్రాస్‌రోడ్స్ దగ్గర అందరూ బస్ దిగిపోయారు. నేను కాస్త వెనకాల దిగాను. దిగి సిగరెట్ అంటించుకుని ప్రశాంతంగా రెండు దమ్ములు లాగాను.

అప్పటికే అక్కడ జనం మూగి ఉన్నారు. ముందుకెళ్ళి జనాన్ని తప్పించుకుని చూశాను.

"ఇందాక తన్నావ్. ఇప్పుడు మాట్లాడరా బాడఖోవ్...." కళ్ళజోడు జుట్టు పట్టుకుని అంటున్నాడు నీలం బనీను. కళ్ళజోడు ఏదో చెప్పాడు. ఏవీ వినబడలేదు. పొట్టలోను, నడుంమీద గుద్దుతున్నాడు. కళ్ళజోడు ఎదురు కొట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. గింజుకుంటున్నాడు. నీలం బనీను అతనికా అవకాశం యివ్వలేదు.

తమలపాకు దాదాపు ఏడుస్తోంది. జనం వింత చూస్తున్నారేతప్ప - ఏవీ కల్పించుకోవడంలేదు. ఏమిటి వీళ్ళంతా వింత చూస్తారేతప్ప ఎవరిది తప్పో — ఎవరు అమాయకుడో కనుక్కోరేం?

ఓ రౌడీ వెధవ ఒకడి పెళ్ళాన్ని అల్లరి


# B.E/B.Tech and M.B.B.S Entrance Coaching-1981

For all medical and Engineering Colleges including Andhra University

**OUR ACHIEVEMENTS IN 1980 :**

i. First Rank in MBBS Entrance Andhra Medical College, Vizag.
ii. 22 out of 82 Candidates got selected.
iii. 56 out of 220 candidates got selected for B.E/B. Tech.

Fee concession to SC/ST/Physically Handicapped Students Hostel facilities available on reservation on or before 1-5-1981

Duration of coaching : 45 days

For details send Postal Stamps worth Re. 1

**C. K. HARANADHA RAO** B.Sc., M.Tech., M.I.A.E. M.I.S.T.D., M.I.I.W., M.I.S.T.E., M.I.S.E.
DIRECTOR

**INSTITUTE OF SCIENCE & TECHNOLOGY**

Near Saraswathi Theatre, Visakhapatnam - 20

చేసి పైగా అతనిదే తప్పయినట్లు అమె ముందే భర్తను పట్టుకు కొడుతుంటే ఎవరూ పట్టించుకోరేమిటి ?

ఉగాండాలో ఇడీ అమీన్ ప్రజల్ని ఊచకోత కోస్తుంటే ప్రపంచం ఊరికే చూసింది. ఇరాన్‌లో అమెరికన్ వుద్యోగులను నెలలతరబడి, సంవత్సరాల తరబడి బంధించి వాళ్ళేమయ్యారో చెప్పకుండా దాచేస్తే ప్రపంచం ఊరికే చూసింది.

అలాగే చుట్టూ జనం అందులో చాలా మంది ఆ బస్సులోంచి దిగిన వాళ్ళే. చూస్తున్నారు అంతా.

వాళ్ళల్లో వాళ్ళమధ్యలో అసలునిజాన్ని తెల్సున్న నేనూ....?

మా ఇంట్లో గోడకు వేళ్ళాడే వివేకానందుని బొమ్మ. పక్కనేవున్న సూక్తి నన్ను వెక్కిరించాయి.

'భయానికి మించిన చావులేదు. ఫియర్ ఎలోన్ ఈజ్ డెత్....'

జనాన్ని తోసుకుని ముందుకి వెళ్ళాను. నీలం బనీను ఎదురుగా నిలబడి-

"ఇందాకట్నుంచి చూస్తున్నాను. రౌడీ పనులు చేసిందిచాలక— ఏమిట్రా నీ జులుం ?"

మెడవంచి రెండు గట్టిగా తగిలించాను. మీదకు రాబోయాడు. లాగితన్నాను. కింద పడ్డాడు. కళ్ళజోడుకి ధైర్యం వచ్చింది. తనూ నాలుగు తగిలించాడు. బనీను పట్టుకుని లేవదీసి "పో అవతలికి. ఇంకా ఇక్కడే ఉన్నావంటే చంపేస్తాను." గట్టిగా వెనక్కితోశాను. బనీను చిరిగింది. వాడు వడివడిగా అక్కణ్నుంచి వెళ్ళిపోయాడు.

ఆటోని పిల్చి కళ్ళజోడు దంపతుల్ని అందులో ఎక్కమన్నాను. వాళ్ళు వెళ్ళిపోయారు.

నేను అక్కణ్నుంచి అరమైలు నడిస్తేకాని-మా ఇల్లు రాదు. నీలం బనీను నన్ను ఒంటరిని చేసి కొడతాడనికాని, మరో నలుగుర్ని పోగుచేసుకుని వస్తాడనికాని నాకు భయం వేయలేదు. అదే మాట మళ్ళీ మళ్ళీ నా చెవుల్లో వినిపిస్తోంది. 'ఫియర్ ఎలోన్ ఈజ్ డెత్....'

చుట్టూ జనం.... వీళ్ళంతా బతికున్న శవాలు. కొన్ని నుంచున్న శవాలు, కొన్ని నడుస్తున్న శవాలు, కొన్ని చూస్తున్న శవాలు. కొన్ని కూర్చున్న శవాలు.

ఈ శవాల మధ్యలోంచి శవంలా కాక ప్రాణమున్న మనిషిలా.. నడుచుకుంటూ వెళ్ళిపోయాను.

Estd : 1970 Phone : 1843

**M. B., B. S. & B Tech (Entrances)**

- ప్రతి సంవత్సరము 100 కి 20 మంది విద్యార్థులకు seats లభించుచున్నవి.
- Coaching by experienced lecturers.
- Cyclostyled notes Covering all Possible topics (800 Pages)

I Batch 11–5–81 నుండి రెండవ Batch లేదు.
మీ seat వెంటనే Reserve చేసికోండి.
0–35 self addressed కవరును పంపండి.

M. S. Raju. .A., B.Sc, Correspondent.

**RAJU TUTORIALS,**
H. O. : Near V. R. College, NELLORE
B. O. : Opp. Fish Market, NELLORE.

స్టీలు మరియు ప్లాస్టిక్ జార్లలో
450 వాట్ మోటార్, రెండు రంగులతో




JOHNSON

మిక్చర్ గ్రైండర్
శక్తికి, వనితనానికి కూడా ఒకటో రకము.

సోనో విజన్,
ఏలూరు రోడ్డు, విజయవాడ-2.

లక్కీ "జాన్సన్" కస్టమర్ స్కీము విజయవాడ "సోనోవిజన్"లో "జాన్సన్" కస్టమర్ స్కీములో శ్రీ ఎమ్. ఆంజనేయులు (విజయవాడ) సింగపూర్ మరియు మలేషియా ఉచిత విహార యాత్ర జరుపటానికి విజేతగా ఎన్నికైనారని తెలుప సంతసించుచున్నాము.




ప్రపంచం
సచిత్ర మాస పత్రికలో_

యద్దనపూడి సులోచనారాణి
మల్లాది వెంకటకృష్ణమూర్తి సీరియల్స్ చదవండి!